క్లుప్తంగా

'బార్' ఎన్నికల నామినేషన్లు షురూ



నామినేషన్ వేస్తున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం మొదటిరోజు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షురాలు అనితాబాయి, సుందర్‌సింగ్ నామినేషన్లు వేయగా, వైస్ ప్రెసిడెంట్ పదవికి జనార్దన్, జనరల్ సెక్రటరీ పదవి కోసం సురేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కోసం ఎస్.వి.మల్లికార్జున, కోశాధికారిగా ఏఎండీ లతీఫ్‌అహ్మద్ నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరు



విద్యార్థి వీరస్వామి

ఆదోని సెంట్రల్: పుట్టెడు దుఃఖంలోనూ ఓ విద్యార్థి పరీక్షకు హాజరైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన వీరస్వామి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నాడు. విద్యార్థి తల్లి జయశ్రీ కిడ్నీ సమస్యతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం ఉదయం మృతి చెందిందనే విషయం తెలియగానే వీరస్వామి తల్లడిల్లిపోయాడు. అంతటి దుఃఖంలోనూ శుక్రవారం నాటి పరీక్షకు హాజరయ్యాడు. ఆ తర్వాత తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. సాయిభారతి పాఠశాలలో చదువుతున్నట్లు తండ్రి రాజు తెలిపారు.

సెపక్‌తక్రా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి షీల్డ్ అందజేస్తున్న మురళీబాబు

ఆదోనిసెంట్రల్: ఆలిండియా యూనివర్సిటీ సెపక్ తక్రా చాంపియన్ షిప్ ఫర్ మెన్–2022–24 క్రీడా విభాగంలో ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా పోటీలు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగాయి. రాయలసీమ విశ్వవిద్యాలయం, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ తరపున డా.జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల విద్యార్థులు వి.సురేష్, బోయ అరవింద్ మూడో స్థానంలో నిలిచారు. వారిని కరస్పాండెంట్ కె.వి.మురళీబాబు, ప్రిన్సిపాల్ డా.డి.స్వామినాథ్ శుక్రవారం అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో శుక్రవారం ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి అక్కడ సారా తయారీకి బిందెల్లో నిల్వ ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊట, సారాతో పాటు బిందెలను ధ్వంసం చేశారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మంగలి ప్రకాష్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె–నందవరం ప్రధాన రహదరిలో కనకవీడు క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి ప్రకాష్ (24) మృత్యువాత పడ్డాడు. మరో వ్యక్తి బోయ గణేశ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరుకు చెందిన స్నేహితులు ప్రకాష్, గణేశ్ పని నిమిత్తం నాగలదిన్నెకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నాగలదిన్నె– నందవరం ప్రధాన రహదారిలో కనకవీడు క్రాస్ రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర రక్త గాయం కావడంతో ప్రకాష్ అక్కడిక్కడే మృతి చెందాడు. గణేశ్ తల, ముఖానికి గాయం కావడంతో అక్కడున్న వారు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేశ్ ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరీవీడు గ్రామానికి చెందిన ఆర్యన్ (6) అనే బాలుడు శుక్రవారం సాయంత్రం పాము కాటుకు గురయ్యాడు. వివరాలు.. గ్రామానికి చెందిన లింగన్న కుమారుడు ఆర్యన్ సాయంత్రం ముఖం కడుక్కునేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లాడు. ముఖం కడుక్కుంటుండగా పాము కాటు వేసింది. గమనించిన ఆర్యన్ కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

ఊరూరా ప్రగతి సౌధాలు

- ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు
- దరి చేరిన సర్కారు వైద్యం

మంత్రాలయం: ఒకప్పుడు ప్రభుత్వ అధికారి పల్లెకు వస్తే బడిలోనో.. గుడినో చూసుకుని పనులు చక్కబెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. పల్లెల్లో భూమి, ఇంటి శిస్తు కట్టించుకోవాలంటే చెట్ల కింద.. రచ్చబండల పైనా కూర్చుని తీరువాలు కట్టించుకునే దుస్థితి. కనీసం వైద్య సేవలు అందించాలన్నా ఇదే వైనం. జిల్లా కలెక్టర్ మొదలు గ్రామ అధికారి వరకు ఇవి ఎదురైన సంఘటనలే. నేడు ఆ పరిస్థితి మారింది. ఏ స్థాయి అధికారి వచ్చినా సచివాలయంలో వాలిపోతున్నారు. వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాలు, వైద్యాధికారులు వైఎస్సార్ హెల్త్ సెంటర్లో పనులు చక్కబెట్టుకుని పోతున్నారు. ప్రగతి సౌధాలు వెలియడంతో ఒక్క గ్రామస్తులకే కాదు.. ఉన్నతాధికారులకు సైతం ఊరటనిస్తున్నాయి. మునుపటి కష్టాలను దూరం చేసి పల్లె వాసులకు ప్రభుత్వ సేవలను చేరువచేశాయి. గ్రామాల్లో ప్రధానంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు పల్లెలకు వన్నె తెచ్చాయి.

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 80 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా అందులో 50 సచివాలయాలను రూ.40 లక్షలు చొప్పున వెచ్చించి పూర్తి చేశారు. అలాగే 77 ఆర్బీకే సెంటర్లకుగానూ 30 కేంద్రాలను రూ.21.80 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మించారు. అలాగే మొత్తం 56 వైఎస్సార్ హెల్త్ సెంటర్లకుగానూ 26 హెల్త్ సెంటర్లు పూర్తి చేశారు. ఇలా దాదాపుగా ప్రతి గ్రామంలోనూ ప్రగతి భవనాలు నిర్మించడం జరిగింది. మంత్రాలయంలో రైతుల సౌకర్యార్థం సీడ్ టెస్టింగ్ ల్యాబ్ సైతం ఏర్పాటు చేశారు. కౌతాళం మండలంలోని బదినేహాల్ గ్రామంలో రూ.2 కోట్లు వెచ్చించి 30 పడకల ఆసుపత్రి సైతం నిర్మించారు. ప్రతి ఊరిలోనూ ప్రభుత్వ భవనాలు కట్టడాలు నిర్మించి ప్రజలకు సేవలు చేరువ చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



బదినేహాల్‌లో నిర్మించిన 30పడకల ఆసుపత్రి

నియోజకవర్గం :	మంత్రాలయం
పంచాయతీలు :	94
మొత్తం గ్రామ సచివాలయాలు :	80
నిర్మించిన సచివాలయాలు :	50
కట్టిన రైతు భరోసా కేంద్రాలు :	30
పూర్తయిన హెల్త్ క్లినిక్ సెంటర్లు :	26



మంత్రాలయంలో ఏర్పాటు చేసిన విత్తన పరీక్ష కేంద్రం

గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు



గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్లు నిర్మించడంతో అన్ని రకాల సేవలు అందుబాటులోకి ఉచ్చాయి. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటి సేవలు అందిస్తుండడంతో బీదలకు మేలు జరుగుతోంది. ఇలాంటి కార్యక్రమాలతో ప్రభుత్వానికి మంచి గుర్తింపు వచ్చింది. – రాఘవేంద్రరెడ్డి, సుంకేశ్వరి



మంత్రాలయం గ్రామ సచివాలయ భవనం

కోట్లాది రూపాయలు భవన నిర్మాణాలకు వెచ్చించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, మాజీ ఎంపీటీసీ చౌదరి బసవలు అన్నారు. శుక్రవారం కౌతాళంలో సచివాలయం వారీగా బాపురం రోడ్డు, ముల్లార్‌వీధి, మంచాల్‌వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నాలుగోసారి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి అందించిన పథకాలను వివరించారు. ఎన్నికల సమయంలో కనిపించే తెలుగుదేశం నాయకుల కల్లిబొల్లి మాటలు నమ్మకుండా జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజ్‌అహ్మద్, వడ్డెరాము, వెంకటరామరాజు, నారాయణి, ఇద్రూస్, తాహెర్, వులిగప్ప పలువురు నాయకులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



చిన్నకడబూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కలసిన మండల నాయకులు

పెద్దకడబూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నకడబూరులో ఆంజనేయ స్వామిని వారు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్ అనసూయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. గ్రామంలో తిరిగి నాయకులు, కార్యకర్తలను కలిశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు ఏకమై గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించుకునేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ రవిచంద్రరెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, జాము మూకయ్య, లక్ష్మన్న, నారాయణస్వామి, మాధవరెడ్డి, సీతారామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోసిగి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

- వైఎస్సార్‌సీపీ వాల్మీకి నాయకుల సవాల్
- రాంపురం రెడ్డి సోదరులను విమర్శించే స్థాయి రాఘవేంద్రరెడ్డికి లేదు



మాట్లాడుతున్న మండల వాల్మీకి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మంత్రాలయం నియోజకవర్గంలో వాల్మీకులకు అండగా రాంపురం రెడ్డి సోదరులు నిలిచారని కోసిగి మండల వాల్మీకి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న అన్నారు. గురువారం కోసిగిలో వారు వివిధ గ్రామాల వాల్మీకి నాయకులు, సర్పంచ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి రాంపురం రెడ్డి సోదరులను, వైఎస్సార్‌సీపీ కోసిగి మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డిపై అనాలోచిత వాఖ్యలు చేస్తూ వాల్మీకి వర్గీయులను రెచ్చగొట్టడం తగదన్నారు. ఆయన కుటుంబానికి రాంపురం రెడ్డి సోదరుల కృషితోనే జిల్లా స్థాయి పదవిని కట్టబెట్టిన విషయం మర్చిపోయావా అని ప్రశ్నించారు. పార్టీ మారి ఎమ్మెల్యే టికెట్ రావడంతో పదవి ఇచ్చిన వారిని మరిచిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన నాయకులను గుర్తించి వాల్మీకులకు అధికంగా ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్ పదవులు కేటాయించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. పదవులు కేటాయించడమే కాకుండా గ్రామాలాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. కోసిగిలో వాడవాడలా సీసీ రోడ్డు డ్రయినేజీ కాలువలు దాదాపు 40కు పైగా వేయించారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పులికనుమ నుంచి తాగు, సాగునీటిని అందించేందుకు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోసిగిలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధంమా అని రాఘవేంద్ర రెడ్డికి సవాల్ విసిరారు. ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ భీమక్క, నాడుగేని నాగరాజు, వందగల్లు సర్పంచ్ కొరవంజమ్మ, చిర్తనకల్లు సర్పంచ్ ఈరన్న, కాల్వ లక్ష్మయ్య, ఈరన్న, వీరారెడ్డి,నేలకోసిగి లక్ష్మన్న, మూగలదొడ్డి సోమేష్ తదితర వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాచార్యుల జయంత్యుత్సవం





పేట వీరభద్రస్వామి, రేణుకాచార్యులకు అభిషేకం చేస్తున్న అర్చకులు, కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

ఆదోనిఅర్బన్: స్థానిక శ్రీ పేట వీరభద్రస్వామి ఆలయంలో శ్రీ ఆదిజగద్గురు రేణుకాచార్యుల జయంత్యుత్సవం శుక్రవారం ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వీరభద్రస్వామికి, రేణుకాచార్యులకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జంగమ వటులకు అయ్యాచార కార్యక్రమం జరిపించారు. ముందుగా వీరశైవ మహిళలు గంగపూజ చేసి ఊరేగింపుగా కలశాలతో ఆలయానికి చేరుకుని స్వామివారిని గంగతో అభిషేకించారు. కార్యక్రమానికి పాల్తూరు కల్లహోలే మఠం పీఠాధిపతి చెన్నవీర శివాచార్య, జంగమరహోసల్లి పురవర్గమఠం పీఠాధిపతి అజాత శంభులింగ శివాచార్య, రౌడుకుంది హీరేమఠం పీఠాధిపతి శివయోగి శివాచార్య, ఆదోని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ మహాస్వామి పాల్గొని జంగమవటులకు అయ్యాచారం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధర్మాన్ని దేశం సుఖసంతోషాలతో ఉంటుందన్నారు. పురుషోత్తంస్వామి, ఎర్రిస్వామి, వీరేష్, పరమేశ్వరయ్య, మంజునాథ్, మహర్షి విజయ్‌కుమార్, నాగరత్నమ్మ, కళ్యాణి, గిరిజావాణి పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి అర్చకులు రంగస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేశారు. రాత్రి స్వామి వారు సతీసమేతంగా సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సృష్టికి తానే సర్వం సహ చక్రవర్తి అని అందరికీ తెలిపేందుకు సింహ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు రంగస్వామి తెలిపారు. ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని రూరల్: వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎండాకాలంలో వేడి వల్ల చాలామందిలో మైకం, ఆందోళన, వికారం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి వెళ్లకుండా, పగటిపూట 12 నుంచి 3 గంటల వరకు నీడ పట్టున ఉండాలన్నారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శరీరం ఎక్కువగా అలసిపోకుండా చూసుకోవాలన్నారు. ఇంటి నుంచి బయలుదేరే ముందు గ్లాసు నిమ్మరసం, మజ్జిగ, లస్సీ, లేదా ఒక గ్లాస్ నీటిలో చిటికెడు ఉప్పు, రెండు టీ స్పూన్‌ల చక్కెర వేసి తాగాలన్నారు. తల, చెవులను కప్పుకోవాలని, గొడుగు, వాటర్ బాటిల్ వెంట ఉంచుకోవాలన్నారు.

వడదెబ్బ లక్షణాలు..

- ఎండదెబ్బకు గురైనట్లయితే సరైన చికిత్స తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల పరిస్థితి దిగజారకుండా ఉంటుంది
- కొంచెం మైకంతో పాటు తల తిరుగుతున్న అనుభూతి ఉంటుంది.
- తలనొప్పి, మైకం ఉంటుంది.
- ఏకాగ్రత ఉండదు.
- బలహీనత, కండరాల నొప్పి
- విపరీతమైన దాహం, కడుపులో తిప్పుతున్న అనుభూతి
- వాంతులు, విరేచనాలు, అతిసారం

వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు..

- ఎండలో బయటకు వెళ్లేవారు టోపీలు, స్కార్ఫ్‌లు వాడాలి
- మధ్యాహ్నం 12 నుంచి 5 గంటల వరకు బయటకు వెళ్లకపోవడం మంచిది.
- ప్రతి అరగంటకు ఒకసారి 300 మి.లీ. చొప్పున రోజుకు ఐదారు లీటర్లు నీటిని తగ్గకుండా తాగాలి. ఓఆర్‌ఎస్, కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్ నీరు తీసుకోవడం మంచిది.
- విద్యార్థులు పరీక్ష సమయం కావడంతో ఎండ నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి. సాయంత్రం సమయంలో ఆడుకోవడం మంచిది.
- నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. పండ్లు, పండ్ల రసాలు తాగాలి.
- శరీరం లవణాలను కోల్పోకుండా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. ఉప్పు వేసిన ద్రవాలు ఇవ్వాలి.
- చెమటను గ్రహించే వదులైన కాటన్ దుస్తులను ధరించాలి.
- శీతల పానీయాలకు బదులుగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకుంటే శరీరం లవణాలను కోల్పోదు.

హాస్టల్ మూసివేయడం సరికాదు

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్‌లో బీసీ బాలికల హాస్టల్ మూసివేయడం సరికాదని డీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ అన్నారు. డీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బీసీ బాలికల హాస్టల్‌ను మూసివేయడం దారుణమన్నారు. కేవలం బీసీ బాలికల హాస్టల్‌ను ఎందుకు మూసివేశారని, జిల్లా వెల్ఫేర్ అధికారులు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. డిగ్రీ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో బాలికల హాస్టల్‌ను మూసి వేయడం తగదన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి వంశీ, రఘు, విక్రమ్, సునీల్ పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఈఎస్ వినోద్‌కుమార్

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి చెక్‌పోస్టును శుక్రవారం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐ రామ్మూర్తి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి ఆంధ్రాకు మద్యం, డబ్బు ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తనిఖీల సమాచారం ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు.

క్షయపై అవగాహన అవసరం

ఆదోనిటౌన్: క్షయ వ్యాధిపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ బాబురాజు అన్నారు. శుక్రవారం మండిగిరి పురపాలక పాఠశాల విద్యార్థులు, వైద్య, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సపై అవగాహన కల్పించారు.

మహిళకు ఐదేళ్ల జైలుశిక్ష

పత్తికొండ రూరల్: పత్తికొండలోని సాయిబాబా ఆలయం ఆవరణలో 12 ఏళ్ల క్రితం దేవుడి ప్రసాదంలో మత్తుమందు కలిపి ఓ భక్తురాలి ఆభరణాలు చోరీ చేసేందుకు ప్రయత్నించిన కేసులో నిందితురాలికి ఆదోని సబ్ కోర్టు జడ్జి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని అర్బన్ సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. కేసు వివరాలు.. 2012 అక్టోబర్ 8న పత్తికొండ సాయిబాబా ఆలయ వీధికి చెందిన ఉన్న జయలక్ష్మీ స్వామి దర్శనానికి వెళ్లింది. ఆలయం వద్ద ఉన్న హరిజన లక్ష్మీదేవి దేవుడి ప్రసాదం అని చెప్పి జయలక్ష్మికి మత్తుమందు కలిపిన ప్రసాదం ఇచ్చింది. ప్రసాదం తిన్న జయలక్ష్మి కళ్లు తిరిగి పడిపోగా ఆమె చెవి కమ్మలు, ముక్కుపుడకలు అపహరించేందుకు యత్నించింది. తేరుకున్న బాధితురాలు కేకలు వేయడంతో అక్కడున్న వారు లక్ష్మీదేవిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ కేసు శుక్రవారం తుది విచారణ పూర్తికాగా నేరం రుజువు కావడంతో నిందితురాలికి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నేరస్తురాలిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్వో మురళీ

మంత్రాలయం: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ మురళీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం చేయాలనుకున్న అభ్యర్థులు ముందుగానే అనుమతులు పొందాలని సూచించారు. ప్రభుత్వ ప్రదేశాల్లో అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు ఉండకూడదన్నారు. ఎన్నికలు సాఫీగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో మొత్తం 2,01,554 ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 1,01,233, స్త్రీలు 1,05,300, ట్రాన్స్‌జెండర్స్ 21, వికలాంగులు 240 మంది ఉన్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 24 సెక్టార్లు ఏర్పాటు చేశామని, 30 రూట్ మ్యాప్‌లు ఉన్నాయన్నారు. ఖగ్గల్, దిబ్బనదొడ్డి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించినట్లు చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద ఎస్‌ఓలతో తనిఖీలు ఉంటాయన్నారు. అక్రమ మద్యం, నగదు రవాణాపై నిఘా ఉంటుందన్నారు. మంత్రాలయంలోని పరిమళ విద్యానికేతన్‌లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయగా రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ సాగుతుందన్నారు. ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డీటీ రాఘవేంద్ర, ఆర్‌ఐ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



భార్యతో మృతుడు పింజరి ఖాసీం (ఫైల్)

ఆదోనిఅర్బన్: మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన మాబుసాబ్, ఖాజాబీ దంపతుల పెద్ద కుమారుడు పింజరి ఖాసీం (21) కోలుకోలేక మృతి చెందాడు. గత నెల 26న విరుపాపురం నుంచి ములుగుందం వెళ్తున్న ఖాసీం ఆస్పరి బైపాస్ రోడ్డు వద్ద సబ్ కలెక్టర్ వాహనం ఢీకొట్టగా వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలులో చికిత్స పొందుతున్న ఖాసీం ఈనెల 11న డిశ్చార్జ్ అయ్యి స్వగ్రామం చేరుకున్నాడు. అయితే కోలుకోలేక శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య చాంద్‌బీ నాలుగు నెలల గర్భిణీ. మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, కుటుంబ పెద్దదిక్కును కోల్పోయామని మృతుడి భార్య, కుటుంబ సభ్యులు విలపించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ మంజునాథ్, తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ ఎర్రిస్వామి మృతుడి ఇంటికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతిపై ట్రాఫిక్ సీఐ మంజునాథ్‌ను వివరణ కోరగా.. ఖాసీం మృతిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.